క్లుప్తంగా


మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు భువనేశ్వరి అమ్మవారి జయంతి



పెద్దాపురం: పట్టణంలోని భువనేశ్వరీ మాత జయంతి వేడుకలు ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు లక్ష్మీ లలితా వాస్తు జ్యోతిష్యాలయం భువనేశ్వరి మాత పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భాద్రపద శుద్ధ అష్టమి రోజున అమ్మవారి జయంతిని పురస్కరించుకుని భువనేశ్వరి పీఠంలో విశేష పూజలు జరుగుతాయన్నారు. భక్తులు ముందుగా తమ గోత్ర నామాలు తెలియజేయాలన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: వివిధ అంశాలపై చర్చించేందుకు శనివారం పురపాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

నాగులాపల్లిలో క్షీణించిన పారిశుధ్యం



నాగులాపల్లి ప్రధాన రోడ్డులో నిలిచిన మురుగు నీరు

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లి గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంటుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద డ్రైన్లు పూడుకుపోయాయి. దీంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అటుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు మండిపడుతున్నారు. రోజురోజుకూ పారిశుధ్యం క్షీణిస్తుండడంపై ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పారిశుధ్యాన్ని మెరుగుపర్చే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆ నలుగురు కాలుపెట్టేదెలా..?

- చెత్తాచెదారంతో నిండిపోయిన శ్మశాన వాటిక
- తుప్పలతో అడవిగా మారిన వైనం
- అసాంఘిక శక్తులకు అడ్డాగా మరుభూమి
- బాగు చేయాలని ఇందిరానగర్ వాసుల విన్నపం



శ్మశాన వాటికలో చెత్తాచెదారం



కాలు పెట్టేందుకు అనువుగా లేని మరుభూమి

పిఠాపురం: అంతిమ సంస్కారాలు చేయడం ఎంతో ఇబ్బందిగా ఉంది.. మరుభూమిని బాగు చేయండంటూ పిఠాపురం ఇందిరానగర్ వాసులు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు. తమ పరిధిలో ఉన్న మరుభూమిలో అడుగు పెట్టడానికి వీల్లేకుండా ఉండడంతో.. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానిని వెంటనే బాగు చేయించి తమ ఇబ్బందులు తొలగించాలని కోరుతూ పలమార్లు కౌన్సిలర్ బోను దేవ ఆధ్వర్యంలో స్థానికులు పిఠాపురం పాడా కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాలూ అందజేశారు. అయినా ఫలితం లేకపోవడంతో మరుభూమి అభివృద్ధికి రోడ్డెక్కేందుకు సన్నద్ధమవుతున్నారు.

పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6, 7, 9 వార్డుల్లో సుమారు పది వేల మంది జనాభా ఉంటున్నారు. ఆయా ప్రాంతాలకు ఉద్దేశించిన ఇందిరానగర్‌లోని మరుభూమిలో పిచ్చి మొక్కలు మొలిచి.. అడుగు పెట్టడానికి వీల్లేకుండా తయారైంది. ఇదే అదనుగా భావించిన ఆకతాయిలు, మందుబాబులు మరుభూమిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా మృతి చెందితే అంతిమ సంస్కారాలు చేయడం నరక యాతనగా ఉందని వాపోతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మరుభూమి తుప్పలతో భయానకంగా తయారైందని, అంతిమ సంస్కారాలకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే మరుభూమిని బాగు చేయించి, అసాంఘిక శక్తులు చేరకుండా రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంటోంది



ఎవరైనా చనిపోతే ఆ బాధ కంటే, అంతిమ సంస్కారాలు ఎలా చేయాలన్న బాధే ఎక్కువగా ఉంటోంది. మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటోంది. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఎవరైనా చనిపోతే నానాయాతన పడి అంతిమ సంస్కారాలు చేయాల్సి రావడంతో, వెంట వచ్చే వారు కూడా భయపడుతున్నారు. కనీసం మరుభూమిలో అడుగు పెట్టడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. పిచ్చి మొక్కలు నరకం చూపిస్తున్నాయి. అందరం కలిసి దారి చేసుకుని కార్యక్రమాలు పూర్తి చేస్తున్నాం. అధికారులు వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలి.

– దాకే సుబ్బారావు, ఇందిరా నగర్, పిఠాపురం

ఇంత దారుణమా..!



కాలు పెట్టడానికి కూడా వీల్లేని ఆ మరుభూమిలో వెళ్లాలంటే భయమేస్తోంది. ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు. పిఠాపురాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామంటున్నారు. కనీసం మరుభూమిని మాత్రం పట్టించుకోవడం లేదు. గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిలు అసాంఘిక కార్యక్రమాలకు మరుభూమిని వాడుకుంటున్నారు. ఎక్కడ చూసినా మందు సీసాలు దర్శనమిస్తున్నాయి. అధ్వానంగా ఉండడంతో ఆకతాయిలకు అడ్డాగా మారిపోయింది. దీనిని బాగు చేయాలని ఎన్నోసార్లు అధికారులకు అర్జీలు పెట్టాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– కూరాకుల కృష్ణ, ఇందిరానగర్, పిఠాపురం

ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ట్రస్టు బోర్డు సభ్యులు

సామర్లకోట: పట్టణంలోని అతిపురాతన వేణుగోపాలస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. చైర్మన్‌గా తుమ్మల గౌరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా దేశెట్టి సూర్యవేణి పార్వతి, పద్దిపర్తి అనంత శివరామకృష్ణ, కాళ్ల పార్వతి, సిద్ధా సూర్యనారాయణ, మసకపల్లి లకువుడు, సుకపట్ల గీత, తాతపూడి వేణుగోపాలకృష్ణ, గోపాలదాసు రవి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఖండవిల్లి అనంతశ్రీకృష్ణ సుదీర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో వీరితో దేవదాయ శాఖ తనిఖీదారు వడ్డీ ఫణీంద్రకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి, రైతులు పాల్గొన్నారు.

డ్రైన్ నిర్మాణం పరిశీలన

సామర్లకోట: పట్టణంలోని తెలుకులపంతలో డ్రైన్ నిర్మాణాన్ని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య శుక్రవారం పరిశీలించారు. 13వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న డ్రైను, కల్వర్టు పనులకు వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. డ్రైను పనులు పరిశీలించి, నీటి ప్రవాహం ఉన్న వైపు వాటం ఉండేలా చూడాలని కాంట్రాక్టరుకు కమిషనర్ సూచించారు. ఆమె వెంట ఏఈ నరసింహారావు, కౌన్సిలర్ హరిబాబు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

- ఎనర్జీ అసిస్టెంట్ల ధర్నా
- జాబ్‌చార్టుకు డిమాండ్



ఈఈకి సమస్యలు వివరిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

సామర్లకోట: విద్యుత్ మరమ్మతులు చేస్తూ మృతిచెందిన లైన్‌మన్ రామకృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎనర్జీ అసిస్టెంట్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అంతేకాక వార్డు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు జాబ్ చార్టు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ డివిజన్ పరిధిలోని ఎనర్జీ అసిస్టెంట్లు శుక్రవారం స్థానిక ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనర్జీ అసిస్టెంట్లు మాట్లాడుతూ, సచివాలయ పరిధిలో మాత్రమే పని చేయాల్సిన తమను అధికారులు అన్ని పనులకు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అధికారులు చెప్పిన అన్ని పనులను తాము సక్రమంగా నిర్వహిస్తున్నా, తరచూ జరుగుతున్న విద్యుత్ ప్రమాదాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 33 కేవీ బ్రేక్ డౌన్, 11 కేవీ బ్రేక్ డౌన్, ట్రీ కటింగ్, డి లిస్టు, ఫీజ్ ఆఫ్ కాల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్‌తో పాటు, అనేక విధులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆందోళనకారులతో ఈఈ ప్రభాకర్ చర్చలు జరిపారు. ఎనర్జీ అసిస్టెంట్ల జాబ్‌చార్టులకు సంబంధించి వివరణ కావాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఇక నుంచి జాబ్ చార్టు ప్రకారం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఈఈ హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, ప్రమాదాలు జరిగిన సమయంలో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఎనర్జీ అసిస్టెంట్ల ప్రతినిధులు జి.మణికృష్ణ, పెంకే ఏసురాజు, ఆర్ రామాంజనేయులు, తోటకూర గోవిందులు నాయకత్వం వహించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలో విఘ్నేశ్వరుడు

సామర్లకోట: పట్టణంలోని పంచారామ క్షేత్రంలో ఉన్న గణపతి ఆలయంలో శుక్రవారం ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం లక్ష్మీగణపతి హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి వెండి ఆభరణాల అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, వేమూరి చంటి, సన్నిధిరాజు భాస్కర్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా గణపతికి పూజలు

కొత్తపల్లి: గణేశ్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొమరగిరి, మూలపేట, కుతుకుడుమిల్లి శివారు నిదానందొడ్డిలో ఏర్పాటుచేసిన గణపతి మందిరాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో గణపతి మండపాలు, ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. కొమరగిరి శివారు ఆనంద్ నగర్‌లో చిన్నారులు ప్రతిష్ఠించిన గణపతి మట్టి విగ్రహం ఆకట్టుకుంటోంది. రమణక్కపేటలో గణపతిని ఎడ్లబండిపై ఊరేగించి నిమజ్జనం చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కరప: వేళంగి, గురజనాపల్లి, కరప గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాలలో ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఎరువులను బ్లాక్ చేసినా, అధిక రేట్లకు విక్రయించినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఒక దుకాణంలో ఎరువులు, రసాయన మందులు ఒకే గోడౌన్‌లో ఉంచడాన్ని గమనించారు. 15:15:15 రకం 124 బస్తాలు, డీఏపీ 89 బస్తాలు, ఎస్ఎస్‌పీ 6 బస్తాలు అమ్మరాదని రిజిస్టర్‌లో స్టాప్ సేల్స్ రాశారు.

ఉచిత బస్సులపై ఆటో డ్రైవర్ల నిరసన

- ఆర్డీఓకు వినతిపత్రం అందజేత



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

పెద్దాపురం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల ఆటో డ్రైవర్ల జీవనం కష్టతరమంటూ శుక్రవారం పెద్దాపురం ఆటో డ్రైవర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెద్దాపురం పట్టణ ఆటో యూనియన్లు, దివిలి ఆటో యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు స్థానిక మున్సిపల్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఆటో యూనియన్ నాయకులు శ్రీనివాస్, యాకోబు, గొందేశి భద్రరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టిందన్నారు. ఆటో ప్రయాణాలు నిలిచిపోవడంతో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు, రుణ బాధలతో ఆలమటిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్లకు రూ.15వేల సాయంతో పాటు ప్రతీ నెల ఐదు వేల రూపాయల పింఛన్ సౌకర్యం, ఆటోలకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ సబ్సిడీపై ఇవ్వాలని, ఇళ్లు లేని ఆటో డ్రైవర్లకు ఇళ్లు నిర్మించాలని, సబ్సిడీ ఆటోలను ఫైనాన్స్ ద్వారా మంజూరు చెయ్యాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓకు అందజేశారు.

ఉపాధ్యాయులపైనే విద్యార్థుల భవిత

కొత్తపల్లి: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారి ఉన్నతికి బాటలు వేసేది ఉపాధ్యాయులేనని నాగులాపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి అన్నారు. నాగులాపల్లి జిల్లా పరిషత్ పాఠశాల–2లో హిందీ ఉపాధ్యాయుడు మాల్తి వెంకట నాగేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుల అడుగు జాడల్లో నడవలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌తోనే హాకీ క్రీడకు గుర్తింపు



5కే రన్ ప్రారంభిస్తున్న సూరిబాబురాజు

పెద్దాపురం: హాకీ క్రీడకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చింది హాకీ మాంత్రికుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మేజర్ ధ్యాన్‌చంద్ అని పలువురు వక్తలు కొనియాడారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షత వహించారు. టెన్నిస్ జాతీయ క్రీడాకారుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ, ధ్యాన్‌చంద్ పట్టుదల, దీక్ష ఫలితంగా ఒలింపిక్ విజయాలను చూశామన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో క్రీడాసక్తిని పెంచుకుంటే విజయాలు సొంతమవుతాయన్నారు. తొలుత ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం 5కే రన్‌ను ప్రారంభించారు.

నిధుల వినియోగంపై సమాధానం ఇవ్వాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న హరిబాబు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో 2019 నుంచి ఇప్పటివరకు సీ బిల్లు ద్వారా చెల్లించిన వాటి వివరాలు ఇవ్వాలని, వీటికి శనివారం జరిగే కౌన్సిల్ సమావేశంలో సమాధానం చెప్పాలని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అదే విధంగా వాటర్ హౌస్‌లో మోటారు, గణపతి నగరం వాటర్ ట్యాంకుల వద్ద మోటార్లు పని చేస్తున్నాయో, లేదో తెలపాలని చెప్పారు. కార్యాలయంలో జనరేటర్‌కు ఎంత ఆయిల్ వేయిస్తున్నారు, కాలిపోయిన మోటార్లకు మరమ్మతులు, కొత్తవి ఏ కంపెనీవి కొన్నారు, బోర్ల వద్ద పని చేసే సిబ్బందిపై వివరణ కావాలని కోరారు.

మహిళకు బ్యాగ్ అందజేత



సాయిప్రియకు బ్యాగ్ అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: ఆటోలో మర్చిపోయిన బ్యాగ్‌ను ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆ మహిళకు అందజేశారు. సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చిన తోట సాయిప్రియ శుక్రవారం రాజమహేంద్రవరం వెళ్లడానికి ఆటోలో సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌కు కుమార్తెతో వచ్చింది. ఆ క్రమంలో ఆటోలో బ్యాగ్ మర్చిపోయింది. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్సైకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించి, ఆటో డ్రైవర్‌కు ఫోన్‌లో విషయాన్ని తెలిపారు. అతను తిరిగొచ్చి పోలీసులకు బ్యాగ్ అందజేశారు. అందులో పిల్లల సర్టిఫికెట్లు, దుస్తులు, రూ.ఐదు వేల నగదు ఉన్నాయి. బ్యాగ్ అందడంతో సాయిప్రియ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నలుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 15 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సాటిలేని తెలుగు భాష గొప్పతనం



సామర్లకోటలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: తెలుగు భాష గొప్పతనం సాటిలేనిదని యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం కె.శ్రీదేవి అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు పద్య పఠనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు బి శ్రీలక్ష్మి, వి.నూకాలమ్మ తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. అలాగే క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని తెలిపారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా తెలుగు భాష రాయడానికి కృషి చేసి గిడుగు రామూర్తి పంతులు సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి, బి.జయశేషసాయి, డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు.

తెలుగు ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి

పెద్దాపురం: తెలుగు భాష ఔనత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భావి పౌరులపై ఉందని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఏసీటీ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మనసులోని భావాలను వ్యక్తపర్చడం మాతృభాషతోనే సాధ్యమన్నారు. తొలుత గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వనాథం తదితరులు

వివాదాస్పదంగా యూరియా పంపిణీ

- కావాల్సిన వారికి ఇచ్చుకుంటున్నారని రైతుల మండిపాటు
- ఎంఏఓ ఆదేశాలతో రెండు బస్తాల చొప్పున సరఫరా



యూరియా కోసం క్యూలో నిలబడిన రైతులు

కరప: జెడ్.భావారం సొసైటీ వద్ద యూరియా పంపిణీ వివాదాస్పదంగా మారింది. ఆర్ఎస్‌కేకు వచ్చిన యూరియా జెడ్.భావారం సొసైటీ గోదాంలో దింపి, మధ్యాహ్నం ఇస్తామని చైర్మన్ చెప్పడంతో వెళ్లిపోయిన రైతులు.. మధ్యాహ్నం వచ్చేసరికి సగం స్టాక్ చైర్మన్ అనుయాయులకు ఇచ్చేశారని ఆరోపిస్తూ రైతులు మండిపడ్డారు. వచ్చిన రైతులందరికీ రెండు బస్తాల వంతున ఇవ్వాలని ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య ఆదేశించడంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం జెడ్.భావారం ఆర్ఎస్‌కేకు పది టన్నుల యూరియా(225 బస్తాలు) స్టాక్ రాగా, గోదాం లేక జెడ్.భావారం పీఏసీఎస్ గోదాంలో అన్‌లోడ్ చేశారు. అరట్లకట్ట గ్రామానికి చెందిన పలువురు రైతులు యూరియా అడగ్గా, స్టాక్ దిగుతోంది, మధ్యాహ్నం ఇస్తామని చెప్పడంతో వెళ్లిపోయారు. అన్‌లోడ్ చేస్తుండగానే చైర్మన్ ఒకరికి ఆరు బస్తాలు ఇచ్చి పంపించేశారు. అదే సమయంలో అక్కడున్న రైతులు అడగ్గా, పేర్లు రాయించుకోండని, మధ్యాహ్నం ఇస్తామని వెళ్లిపోయారు. రైతులు సొసైటీ వద్దకు వచ్చినప్పటికీ, మధ్యాహ్నం 3.30 వరకూ గోదాం తీయకుండా సిబ్బంది తాత్సారం చేశారు. రైతులు సొసైటీ, వ్యవసాయ అధికారులకు ఫోన్లు చేయగా, పొంతన లేకుండా మాట్లాడుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని, ఎంఏఓ దృష్టికి తీసుకెళ్లగా, అక్కడున్న రైతులందరికీ ఒక్కొక్కరికి రెండు బస్తాల వంతున ఇచ్చి, ఆధార్, ఫోన్ నంబర్లు నోట్ చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ మేరకు రైతులకు యూరియా ఇచ్చి పంపించడంతో వివాదం సద్దుమణిగింది. ఇలాఉండగా రైతులకు బిల్లు రాసి ఇవ్వకుండా, బుక్‌లో నోట్ చేసుకుని బస్తాకు రూ.270 వంతున తీసుకున్నట్టు రైతులు తెలిపారు. యూరియా కొరత ఉందా అని ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ సత్యను విలేకరులు అడగ్గా, రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదని, మండలానికి సరిపడా స్టాక్ డీలర్ల వద్ద, ఆర్ఎస్‌కేల వద్ద ఉందన్నారు.